# ఇరుగు పొరుగు—ఇరవై మెళ్ళు

కాలనీలో బస్సుదిగిన వీరేందర్ తృప్తిగా నవ్వుకున్నాడు తానో పెద్ద ఇంజనీరునని మరిచి....కానీ ఖర్చులేకుండా కోఆపరే టివ్ బాంక్‌లో అప్పు సంపాదించిన అసామీలా. తానేసిన మూడు ముళ్ళు భరించి తనను కొంగుకు ముప్పై ముళ్ళలో ముడేసుకు న్న సుందరి మొహంలోకి చూశాడు. గర్వంగా నవ్వి చక్రాల్లా తిప్పింది కళ్ళు 'ఈ సంక్రాంతికి మానాన్న గారి ముక్కు పిండి కలర్ టీ.వి. ఎలా ఇప్పించగలిగానో చూచారా!' అన్నట్టు పదేళ్ళ దాంపత్య ఫలితం_ దీప, కృష్ణ కుమార్లు పరుగెత్తుతున్నారింటి వైపు కేరింతలతో.

వీరేందర్ చేతిలోని సూటుకేసు సుందరి భుజానికి వేళ్లాడిన ఎయిర్ బ్యాదు అరుగుమీద నిట్టూర్చాయి. ఇంటి తాళం తీసి లోపలి కెళ్ళాలి.

ఆ కాలనీలో ఇంటింటికి బోలెడంత ఎడంతో, పుష్కలంగా గాలి, వెలుతురు ప్రసాదించే కిటికీలతో చాలా ఇండ్లున్నాయి. ఆ ఇంట్లో రెండేళ్ళక్రితం చేరగానే నిర్ణయించుకున్నాడు వీరేందర్. ఈఊర్నుంచి ట్రాన్స్ఫరయ్యే దాకా ఖాళీ చెయ్యనని. తాను కంపెనీకెల్తాడు. సుందరి మహిళా మండలి వెల్తుంది. పిల్లలు ఒడి

కెళ్తారు. ఇంటి పక్కల వాళ్ళతో స్నేహాలు పెంచుకోవడమంటే సుందరికి ఎలర్జీ. అమ్మలక్కలు పప్పులు, శక్కరి, కాఫీ పొడిలాంటివి బదుళ్ళడిగి హైరానా చేస్తారంటుంది. నాల్గుచేతుల సంపాదన బిజీ తప్ప తనికింకే లోకమూలేదు.

తాళం తీసిలోపలి కెళ్ళి-భార్యాభర్తలు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు వింతగా, నాల్గుసార్లు ఇల్లంతా కలియదిరిగారు గాను గెద్దుల్లా. బీరువాలు, సూటుకేసులు, గ్యాసుపొయ్య.... మిగితాసామాన్లూ ఎవ్వీలేవు. ఇల్లంతా ఖాళీ- ఊడ్చేసినట్టుంది. డైరీ తీసి క్వార్టర్ నెందరు చూచాడు వీరేందర్.... అదే నెంబరు. జుట్టు పీక్కున్నాడు. నరాలలో చెమట ప్రవహిస్తుంది. బుర్రలో భూగోళం తిరుగుతుంది వేగంగా.

'ఇది మనిల్లే....!' అన్నాడు ఏడుపు మొహంతో.

'అయ్యో అయ్యో! మనిల్లునెవరు ఖాళీ చేసారండీ?' గుండెలు బాదుకుంది సుందరి..కాస్సేపు పంజెయ్యడం మానేసిందావిడ మెదడు.

'అమ్మా! నా పుస్తకాలేవే?' తొమ్మిదేళ్ళ దీప మండిపడింది

'నా బుల్లి సైకిల్లేదు నాన్నా!' ఏడేళ్ళ కృష్ణకుమార్ తాండవ నృత్యం.

పాపు గంటలో తేరుకుని క్కింటాయన నడుగాలని బయల్దేరాడు వీరేందర్ బరువైన అడుగులతో.

'ఎక్కడికి మార్చారిల్లు?' మందహాసం చేసాడు పక్కింటాయన. అగ్గిమీద ఆజ్యం పోసినట్లైంది వీంరేదర్కు. పక్కింటాయన కుర్చీచూపించాడు కూచొమ్మని.

'మేము ఇళ్ళు ఖాళీ చెయ్యలేదు....' కూలబడ్డాడు కుర్చీలో. ముక్కుమీద వేలతికించుకుంది పక్కింటాయన పెళ్ళాం. 'మొన్న పగలే కదండీ మీ తమ్ముడు లారీతో వచ్చి ఖాళీచేసుకెళ్ళాడు.... కనుబొమ్మలు ముడేసిందావిడ.

'నాకసలు తమ్ముడే లేడు!' గొల్లుమన్నాడు.

నోరెళ్లబెట్టారా దంపతులు. వీరేందర్ బయటి కొస్తుంటే.

'ఎంత పెద్ద ఇంజనీరైతే మాత్రం ఇరుగుపొరుగు వాళ్లతో ఇరవై మైళ్ల దూరముంటే ఇదే అవస్థ. అయ్యో పాపం! పట్టపగలే దొంగలు దోచినా గుర్తుపట్టలేకపోయాం. తమ్ముడంటే నమ్మేశాం.' బుగ్గలు గట్టిగా నొక్కుకుందా ఇల్లాలు.

(సాధన, జూన్ 89)